


కామారెడ్డి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆశ కార్యకర్తలు

## ఉద్యోగ భద్రత కల్పించండి

కామారెడ్డి, డిసెంబర్ 4 : తమకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18వేలతోపాటు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆశ కార్యకర్తలు ఆందోళన చేపట్టారు.బుధవారం కామారెడ్డి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ హామీ మేరకు తాము చేపట్టిన సమ్మెను అక్టోబర్ 9న విరమించినట్లు తెలిపారు. కానీ ఇచ్చిన హామీని ఇప్పటి వరకు నెరవేర్చలేదన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.5 లక్షలు చెల్లించాలని, ప్రతి ఆదివారం, పండుగలకు సెలవు ఇవ్వాలని, ప్రతి ఏడాది 20 రోజుల వేతనంతోకూడిన క్యాజువల్ లీవులు మంజూరుచేయాలని కోరారు. ఆరు నెలల వేతనంతో కూడిన మెడికల్ సెలవులు కూడా ఇవ్వాలన్నారు. 2021 జూలై నుంచి డిసెంబర్ వరకు ఆరు నెలల పీఆర్సీ బకాయిలను వెంటనే ఇవ్వాలని కోరారు. అనంతరం అదనపు కలెక్టర్ విక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్, జిల్లా కమిటీ సభ్యురాలు రాజనర్సు, ఆశ వర్కర్ల యూనియన్ అధ్యక్షురాలు ఇంద్ర, ప్రధాన కార్యదర్శి రాజశ్రీ నాయకులు గంగామణి, నర్శీం, కామేశ్వరి, మమత, పద్మ, శశికళ, కవిత, భాగ్యలక్ష్మి, అనిత, సావిత్రి, సుజాత, విజయ, మంజుల, స్వరూప తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత హైదరాబాద్‌లోని తన నివాసంలో నిజామాబాద్, వరంగల్ ఉమ్మడి జిల్లాల తెలంగాణ జాగృతి ప్రతినిధులతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. జాగృతి ప్రధానకార్యదర్శి నవీన్ ఆచారి, నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు అవంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ‘గురుకుల బాట’ అడ్డగింత



ఎల్లారెడ్డి మైనారిటీ గురుకుల పాఠశాలలోకి రావొద్దంటూ బీఆర్ఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి, జిల్లా ఇన్‌చార్జి సబ్బని హరీశ్‌తో ప్రిన్సిపాల్ రఫత్ వాగ్వాదం



కొయ్యగుట్ట గురుకుల పాఠశాల వద్ద బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు రాజారాం యాదవ్‌ను అరెస్ట్ చేస్తున్న పోలీసులు


- కొయ్యగుట్ట గురుకుల పాఠశాల వద్ద బీఆర్ఎస్ నాయకుల అరెస్టు
- బాన్సువాడ పోలీసుస్టేషన్‌కు తరలింపు
- గురుకులాలను నిర్వీర్యం చేసేందుకు రేవంత్ సర్కార్ కుట్ర
- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు రాజారాంయాదవ్ ఆగ్రహం

బాన్సువాడ రూరల్/ఎల్లారెడ్డి రూరల్, డిసెంబర్ 4 : గురుకుల పాఠశాలల్లో సమస్యలు, విద్యార్థుల ఇబ్బందులను తెలుసుకునేందుకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన ‘గురుకుల బాట’కు ప్రభుత్వం అడుగడుగునా అడ్డంకులు సృష్టిస్తున్నది. కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలంలో గురుకుల బాట కమిటీ సభ్యుడు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు రాజారాం యాదవ్ ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన గురుకుల బాట ఉద్రిక్తతకు దారితీసింది. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు రాజారాం యాదవ్, బాన్సువాడ మున్సిపల్ వైస్ చైర్మన్ జుబేర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు మండలంలోని కొయ్యగుట్ట సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలకు వెళ్లగా.. పోలీసులు అడ్డుకున్నారు. దీంతో బీఆర్ఎస్ నాయకులు పాఠశాల గేటు ఎదుట బైఠాయించి నిరసనకు దిగారు. వారిని పాఠశాల లోపలికి వెళ్లకుండా అరెస్టు చేసి బాన్సువాడ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా రాజారాం యాదవ్ మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే గొప్ప సంకల్పంతో గత కేసీఆర్ ప్రభుత్వం గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేస్తే .. వాటిని నిర్వీర్యం చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కుట్రలు పన్నుతున్నాడని ఆరోపించారు. గురుకుల పాఠశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలను తెలుసుకొని, అందులో ఉన్న లోపాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ చేపట్టిన గురుకుల బాటను అడ్డుకోవడం సీఎం చేతకానితనానికి నిదర్శనమని పేర్కొన్నారు. సీఎం ఎన్ని కుట్రలు చేసి బీఆర్ఎస్ పార్టీని అడ్డుకున్నా, వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మోచి గణేశ్, సబ్బని హరీశ్, శివసూరి, మన్నె అనిల్ తదితరులు పాల్గొన్నారు.

### ఎల్లారెడ్డి మైనార్టీ గురుకులంలో ప్రిన్సిపాల్ వాగ్వాదం

ఎల్లారెడ్డి పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను బీఆర్ఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి, జిల్లా ఇన్‌చార్జి సబ్బని హరీశ్ ఆధ్వర్యంలో సందర్శించారు. తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాలలో అందిస్తున్న భోజనం సరిగ్గా లేదని విద్యార్థులు తెలిపారు. మెనూ ప్రకారం గుడ్లు, చికెన్ అందించడం లేదన్నారు. అనంతరం పక్కనే ఉన్న మైనార్టీ గురుకుల పాఠశాలకు వెళ్లగా.. ప్రిన్సిపాల్ రఫత్ అడ్డుకొని వాగ్వాదానికి దిగాడు. కొద్దిసేపటి తర్వాత ఇద్దరిని మాత్రమే అనుమతించడంతో సబ్బని హరీశ్, ఆదిమూలం సతీశ్‌కుమార్ పాఠశాలను సందర్శించారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి సొసైటీ చైర్మన్ ఏగుల నర్సింహులు, బీఆర్ఎస్ నాయకులు నాగం సురేందర్, అరవింద్‌గౌడ్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

# మళ్లీ రుణ ఊబిలోకి..





### అండగా నిలిచిన కేసీఆర్..

పదేండ్ల క్రితం వరకూ నీళ్లు, కరెంట్ సరిగా లేక, సర్కారు మద్దతు లేక అన్నదాతల బతుకులు ఆగమయ్యాయి. అప్పులు తెచ్చి సాగు చేసినా పంటలు పండక, పండిన పంటలకు గిట్టుబాటు ధర రాక వేలాది మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. కానీ, తెలంగాణ సిద్ధించాక, కేసీఆర్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక వ్యవసాయ రంగానికి పెద్దపీట వేసి, విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. పంటల సాగుకు అవసరమైన పెట్టుబడి కోసం రైతులు అప్పులు చేయొద్దనే భావనతో ప్రతిష్టాత్మక ‘రైతుబంధు’ పథకానికి శ్రీకారం చుట్టారు. 2018–19 వానకాలం నుంచి ప్రారంభమైన ఈ పథకం కింద ఒక్కో పంట కాలానికి ఎకరాకు రూ.5వేల చొప్పున ఏడాదికి రూ.10 వేల పెట్టుబడి సాయం అందించారు. ఉమ్మడి జిల్లాలోని 5.50 లక్షల మంది రైతులకు 11 విడుతల్లో వందలాది కోట్ల రూపాయలను రైతుల ఖాతాల్లో వేశారు. ఒక్కో విడుతలో రూ.500 కోట్ల మేర ప్రభుత్వం పెట్టుబడి సాయం చేశారు. అలాగే, నిరంతర కరెంట్, సరిపడా విత్తనాలు, ఎరువులు అందుబాటులోకి తేవడంతో పాటు మద్దతు ధర చెల్లించి పంటలను కొనుగోలు చేశారు.

### కేసీఆర్ సారు ఉన్నప్పుడు మంచిగుండె..



కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా ఇస్తామంటే నమ్మినం. కానీ, మొన్న వానకాలంల ఇయ్యలే. ఈసారైనా ఇస్తారో లేదో. కేసీఆర్ సారు ఉన్నప్పుడు దుక్కులు దున్నే టైంలనే ఖాతాల్లో డబ్బులు పడుతుండే. అవి విత్తనాలు, ఎరువులు కొనడానికి మస్తు ఉపయోగపడుతుండే. కానీ రేవంత్ సర్కారు అచ్చినంక పైసలు అస్తలేవు. మొన్న వానకాలంల ఇవ్వకుండా మోసం చేసింద్రు. ఇప్పుడు యాసంగికైనా ఇయ్యాలే.

– బుక రాజేందర్, రైతు, చీమన్‌పల్లి

### భరోసా ఇచ్చేది ఎన్నడు?



కాంగ్రెస్ ప్రభుత్వం అచ్చినంక మళ్లీ కష్టాలు మొదలైనయ్. రైతు భరోసా ఇవ్వకపోవడంతో పంట పెట్టుబడికి పైసలు లేక మస్తు ఇబ్బందులు అయితున్నయ్. నారు పోసే టైం అయింది. విత్తనాలు, ఎరువులు కొనాలే. చేతిలో పైసల్లేక అప్పులు చేయాల్సి వస్తున్నది. ప్రభుత్వం వెంటనే రైతుభరోసా డబ్బులు ఇచ్చి రైతులు అప్పుల పాలు కాకుండా చూడాలే.

– భూషణ్, రైతు, గడ్కోలు

- ‘రైతుబంధు’ సాయం ఎగ్గొట్టిన రేవంత్ సర్కారు
- ‘భరోసా’ లేకుండా పోయిన కాంగ్రెస్ హామీ
- కేసీఆర్ హయాంలో కనిపించని కష్టాలు
- కాంగ్రెస్ రాకతో మళ్లీ మొదలైన ఇక్కట్లు
- పెట్టుబడి లేక రైతాంగం దిగాలు
- సాగు కోసం అప్పలు చేస్తున్న అన్నదాతలు

సిరికొండ, డిసెంబర్ 4 : అన్నదాతలు మళ్లీ అప్పుల పాలవుతున్నారు. సర్కారు సాయం లేక రుణ ఊబిలో చిక్కుకుంటున్నారు. దాదాపు దశాబ్ద కాలం తర్వాత పంట సాగు కోసం మళ్లీ మిత్తీలు తెచ్చుకోవాల్సిన దుస్థితి దాపురించింది. కేసీఆర్ పాలనలో పంట పెట్టుబడికి రందీ లేకుండా పోయింది. దుక్కులు దున్నే సమయానికే బీఆర్ఎస్ ప్రభుత్వం ఖాతాల్లో రైతుల డబ్బులు జమ చేయడంతో అన్నదాతలు సంతోషంగా పంటలు పండించారు. అయితే, మార్పు పేరుతో, ఆరు గ్యారంటీల గారడితో జనాల్ని బురిడీ కొట్టించి గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ రైతాంగానికి ఊహించని షాక్ ఇచ్చింది. పంట సీజన్ ఆరంభానికే రైతుల ఖాతాల్లో రైతుబంధు డబ్బులు వేయాల్సిన ఉండగా, వర్షాకాలానికి సంబంధించిన పెట్టుబడి సాయాన్ని ఎగ్గొట్టింది. ఇక, యాసంగి మొదలై నెల రోజలవుతున్నా ప్రభుత్వం నుంచి స్పందన కరువైంది. రైతుభరోసా కింద రూ.15 వేలు ఇస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి రేపు, మాపు అంటూ కాలం గడుపుతున్నారు. నార్లు పోసేందుకు అదును దాటుతుండడంతో రైతులు అయోమయంలో ఉన్నారు. సర్కారు నుంచి డబ్బులు రాకపోవడంతో అప్పులు తెచ్చి విత్తనాలు కొనుగోలు చేస్తున్నారు.

### మోసం చేసిన కాంగ్రెస్..

దశాబ్ద కాలం పాటు హాయిగా ఉన్న రైతులను కాంగ్రెస్ మళ్లీ కష్టాల్లోకి నెట్టేసింది. రేవంత్ ప్రభుత్వం రైతుబంధు ఎగ్గొట్టడంతో పెట్టుబడి కోసం అప్పులు చేయాల్సి వస్తున్నది. ఎన్నికల వేళ రేవంత్‌రెడ్డి సహా కాంగ్రెస్ నేతలందరూ గప్పాలు కొట్టారు. రైతుబంధును రైతుభరోసాగా మార్చి కేసీఆర్ ఇస్తున్న రూ.10 వేలకు అదనంగా రూ.5 వేలు కలిపి ఇస్తామని హామీలు గుప్పించారు. కానీ అమలు చేయకుండా రైతులను అప్పుల్లోకి నెట్టేస్తున్నారు. రైతుబంధు డబ్బులు పడకపోవడంతో విత్తనాలు, ఎరువుల కొనుగోలుకు డబ్బుల్లేక అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారు. అదును దాటిపోతుందన్న భయంతో వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. మరోవైపు, వానాకాలం సాయాన్ని ఇప్పటికే ఎగ్గొట్టేసిన రేవంత్ సర్కారు.. యాసంగికి సంబంధించి పూటకో ప్రకటనతో గందరగోళం సృష్టిస్తున్నది. పంటల సాగు ఆరంభానికి ముందే రైతులకు పెట్టుబడి అందించాలన్నది రైతుబంధు ముఖ్య ఉద్దేశం కాగా, కాంగ్రెస్ సర్కారు ఆ లక్ష్యాన్ని నీరుగార్చేసింది. సంక్రాంతి తర్వాత రైతుభరోసా ఇస్తామని రేవంత్‌రెడ్డి సహా మంత్రులు ప్రకటిస్తుండడంపై రైతాంగం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నది. నాట్లు వేశాక మీరు డబ్బులు ఇచ్చి ఏం లాభమని కర్షకులు కన్నెర్ర చేస్తున్నారు.

# ఇసుక ట్రిప్పుల్లో గోల్‌మాల్..

- వీడీసీతోపాటు మరికొందరికి రూ.2 లక్షల జరిమానా
- శెట్‌పల్లిలో జరిగిన ఘటన.. ఆలస్యంగా వెలుగులోకి..

మోర్తాడ్, డిసెంబర్ 4: ఇసుక అక్రమ దందాలో చోటుచేసుకుంటున్న వ్యవహారాలు విస్తుగొల్పుతున్నాయి. ట్రిప్పుల లెక్కల్లో తప్పులు చూపించారని వీడీసీతోపాటు మరికొందరికి రూ.2 లక్షల జరిమానా విధించిన ఉదంతం శెట్‌పల్లిలో చోటు చేసుకున్నది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటనకు సంబంధించి విశ్వసనీయంగా తెలిసిన వివరాల ప్రకారం.. గ్రామశివారులోని పెద్దవాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలించేందుకు వీడీసీతో అధికార పార్టీ నేతలు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇందుకు గాను ఒక్కో ట్రాక్టర్ ఇసుకకు వీడీసీకి రూ.2 వేలు చెల్లించేలా ఒప్పందం కుదిరింది. అలాగే, ఇసుక తరలింపు విషయంలో జోక్యం చేసుకోకుండా అధికారులను సంబంధిత వ్యక్తులే చూసుకోవాల్సి ఉంటుందని నిర్ణయించుకున్నారు. రోజువారీగా తరలిస్తున్న ఇసుక ట్రిప్పులను వీడీసీ సభ్యులే దగ్గరుండి నమోదు చేసుకుంటారు. ఈ క్రమంలోనే కొందరు సభ్యులు, ట్రాక్టర్ డ్రైవర్లు కుమ్మక్కై ట్రిప్పుల సంఖ్యను తక్కువగా నమోదు చేశారు. ఇలా ఒక్కో ట్రిప్పుకు రూ.2 వేల చొప్పున మిగుల్చుకుని, ఆ డబ్బును సంబంధిత సభ్యులు, డ్రైవర్లు పంచుకుంటున్నారు. ఈ విషయం బయటికి రావడంతో మంగళవారం గ్రామస్తులు పంచాయితీ పెట్టారు. లెక్కల్లో తప్పులు చూపినందుకు బాధ్యులకు రూ.2 లక్షల జరిమానా విధించాలని నిర్ణయించారు. ఆ డబ్బులు చెల్లించిన తర్వాతే ఇసుక తవ్వకాలు మొదలు పెట్టాలని నిర్ణయించినట్లు తెలిసింది. అక్రమ ఇసుక తవ్వకాలు గ్రామాల్లో చిచ్చుపెడుతున్నా, జరిమానాలకు దారి తీస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం అనేక అనుమానాలకు తావిస్తున్నది.



ఆర్టీసీ బస్సు సర్వీసుల సంఖ్య పెంచాలని, ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజా పంథానాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు నిజామాబాద్ జిల్లా కేంద్రంతోపాటు ఆర్మూర్‌లో బస్సు డిపోల ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు.

– ఖలీల్‌వాడి/ ఆర్మూర్‌టౌన్, డిసెంబర్ 4

